
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
ఆదివారం 22 సెప్టెంబరు 2024



బొడ్డెమ్మ బొడ్డెమ్మా.. కోల్..

ఉమ్మడి జిల్లాలో బొడ్డెమ్మ వేడుకలకు సిద్ధమైన ఆడబిడ్డలు



సండే స్పెషల్ SUNDAY SPECIAL

- రేపటి నుంచి సాగనున్న సంబురం
- తొమ్మిది రోజుల పాటు సందడే సందడి
- ఆఖరి రోజున నిమజ్జనం
- ప్రాచీన పండుగకు ఆదరణ ఏదీ?
- భావితరాలకు కనుమరుగవుతున్న వైనం

7



బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా కోల్..
నీ బిడ్డ పేరేమీ కోల్..
నీ బిడ్డ నిలగౌరీ కోల్..
నిత్య మల్లెచెట్టేసి కోల్..
చెట్టుకు చెంబేడు కోల్..
నీళ్లు పోసి కోల్..
కాయలు, పిందెలు కోల్..
ఘనమై కాసెను కోల్..
అందుట్ల ఒక పిందె కోల్..
ఢిల్లీకి పాయేను కోల్..
ఢిల్లీలో తిప్పరాజు కోల్..
మేడకట్టించే కోల్..

......తెలంగాణ పల్లె పండుగ బొడ్డెమ్మ పండుగకు ఆడపడుచులు సిద్ధమయ్యారు. పూర్వకాలం నుంచి ఏటా బతుకమ్మ పండుగ ప్రారంభమయ్యే అమావాస్య రోజు ముందువరకు బొడ్డెమ్మ పండుగను యువతులు, బాలికలు వైభవంగా జరుపుకుంటారు. తొమ్మిది రోజుల పాటు పల్లె సుద్దుల గీతాలు, ప్రాచీన పాటలను చప్పట్లతో పాడుతూ సంబురంగా జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ ప్రారంభానికి ఒక రోజు ముందుగా నిమజ్జనం చేస్తారు. ఈ వేడుక నిర్వహించుకోవడం వలన చదువు, జ్ఞానం, ఆరోగ్యం సిద్ధించి మానసికంగా ఎంతో ఆనందంతో ఉంటారని నమ్మకం. వందల ఏళ్ల నుంచి ఆచార సంప్రదాయంగా బొడ్డెమ్మ వేడుకను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.


- వరంగల్ కల్చరల్



స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్
- గాంధీ భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నేతలతో సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నాయకులు

6



వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ వీధిలో రోడ్డుపై వాహనాల పార్కింగ్



హనుమకొండ పెట్రోల్‌పంపు ప్రాంతంలో మాల్స్ ఎదుట వాహనాల పార్కింగ్



హనుమకొండ కేయూ జంక్షన్‌లో రోడ్డుపై పార్కింగ్

బండెలా నిలపాలె..

ఆంధ్రజ్యోతి ఫోకస్

- వరంగల్ నగరంలో తీవ్రమవుతున్న పార్కింగ్ సమస్య
- షాపింగ్ మాల్స్ ఎదుట రోడ్లపైనే వాహనాల నిలుపుదల
- పార్కింగ్ జోన్లపై అమల్లోకి రాని నిర్ణయాలు
- శాశ్వత పరిష్కారాలకు ప్రణాళిక లేదీ?
- దృష్టి సారించని డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పాదాచారులు

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 21: వరంగల్ మహా నగరంలో వాహనాల పార్కింగ్ సమస్య జఠిలంగా మారింది. రోడ్లకు ఇరువైపులా షాపింగ్ క్లాంపెక్స్‌లు, బడా మాల్స్ వెలుస్తుండడం, సెల్లార్లు పేరుకే పరిమితం కావడంతో రోడ్లపై వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. దీనిపై అదుపు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రోడ్లను ఆక్రమించి వాహనాల పార్కింగ్ వల్ల నగరంలోని ప్రధాన రహదారి వరంగల్ - కాజీపేటపైనే ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో అయితే రద్దీ విపరీతంగా ఉంటోంది. ట్రాఫిక్ సమస్య స్తంభించడంలో కాలుష్య సమస్య కూడా అధికమవుతోంది.

శాశ్వత ప్రణాళిక లేదీ?

ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలపై డిస్ట్రిక్ లెవెల్ కమిటీ మూడు నెలలకోసారి సమీక్షా సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా నిర్లక్ష్యం చేస్తోంది. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం డిస్ట్రిక్ లెవెల్ కమిటీలో భాగమైన జిల్లా పోలీసు అధికారులు, బల్దియా, విద్యుత్, ఆర్టీసీ, ఆర్టీఏ, కుడా తదితర శాఖలు ఎప్పటికప్పుడు అధ్యయనాలు, భవిష్యత్తు ప్రణాళికలు రచించాల్సి ఉండగా, ఆ జాడే లేదు. నగరంలోని ఏయే ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభిస్తుందో.. పార్కింగ్ జోన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల అడ్డు తదితర అంశాలను పరిశీలించి పరిష్కరించే చర్యలు కమిటీ చేపట్టాల్సి ఉంటుంది.

పార్కింగ్ జోన్లపై..

గ్రేటర్ వరంగల్‌లో పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. కాజీపేట నుంచి వరంగల్ వరకు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ అవుతున్నాయి. పార్కింగ్ జోన్లు ఏర్పాటుకు అధికారులు పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. కానీ ఒక్కటి కూడా అమల్లోకి రావడం లేదు. వరంగల్ నిర్మలామాల్ నుంచి వరంగల్ చౌరస్తా వరకు రోడ్డుకు ఒకవైపుగా పార్కింగ్ జోన్‌గా అధికారులు ఏర్పాటు చేశారు. దీని నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించారు. అయితే ఇది పూర్తి స్థాయిలో రూపం దాల్చుకోలేదు. వరంగల్ పోచమ్మమైదాన్ నుంచి వరంగల్ స్టేషన్ రోడ్డు వరకు ఇరువైపులా రోడ్డుపై వాహనాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ అవుతున్నాయి. ఫలితంగా ట్రాఫిక్ స్తంభిస్తోంది. హనుమకొండచౌరస్తాలో ప్రాంతం రద్దీగా ఉంటోంది. హనుమకొండ మిషన్ ఆస్పత్రి నుంచి వేయిస్తంభాల ఆలయం వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాల ఎదుట వాహనాలు పార్కింగ్ అవుతున్నాయి. హనుమకొండ అశోకా టాకీస్ ఎదురుగా మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అధికారులు డీపీఆర్‌లు కూడా సిద్ధం చేశారు. టెండర్లు కూడా పిలిచారు. కానీ అంతలోనే ఈ ప్రాజెక్టు నిలిచింది. కాజీపేట చౌరస్తాలో పార్కింగ్ జోన్‌లు లేవు. వ్యాపార సంస్థల నిర్మాణాలు సెల్లార్లు లేకుండానే జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు.



మాల్ ఎదుట రోడ్డుపై వాహనాల పార్కింగ్

మాల్స్ ఎదుట పార్కింగ్

గ్రేటర్ వరంగల్ నగరంలో కాజీపేట నుంచి వరంగల్ వరకు కొన్ని షాపింగ్ మాల్స్ ఎదుట వాహనాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ అవుతున్నాయి. బడామాల్స్ వల్ల, ముఖ్యంగా సాయంత్ర వేళల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ మాల్స్‌కు ట్రాఫిక్ పోలీసులు, బల్దియా అధికారులు ఎటువంటి నోటీసులు ఎందుకు ఇవ్వరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక హనుమకొండ, వరంగల్ చౌరస్తా ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార సంస్థలు తమ వస్తువులను రోడ్డును ఆక్రమించి ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా పాదాచారులు నడవడానికి కూడా కష్టమవుతోంది.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

- జిల్లా జడ్జిలు నిర్మలాగీతాంబ, అపర్ణాదేవి

వరంగల్ లీగల్, సెప్టెంబరు 21: జాతీయ న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా జడ్జి బీవీ నిర్మలా గీతాంబ, హనుమకొండ ఇన్‌చార్జి జిల్లా జడ్జి బి.అపర్ణాదేవి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా న్యాయ సేవా సంస్థ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టులలో, నర్సంపేట, పరకాల మండల కోర్టులలో లోక్ అదాలత్ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వారు తెలిపారు. కక్షిదారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన సివిల్, క్రిమినల్ కేసులు మోటారు వాహన ప్రమాద కేసులు, వివాహ, కుటుంబ తగాదా కేసులు, బ్యాంకు, చెక్ బౌన్స్, విద్యుత్ శక్తి కేసులు, చిట్‌ఫండ్, ఇన్సూరెన్స్ కేసులు, ఎక్సైజ్, విద్యుత్ చోరీ, కన్సూమర్, ట్రాఫిక్ ఈ చలాన్, ప్రీలిటికేషన్ కేసులు, ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని న్యాయమూర్తులు తెలిపారు. హనుమకొండ, వరంగల్ న్యాయ సేవా సంస్థ కార్యదర్శులు జె.ఉపేందర్ రావు, సాయికుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హనుమకొండ , వరంగల్ జిల్లా జడ్జిలు

పేదలకు న్యాయం చేస్తాం..

- కేంద్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి జార్జి కురియన్
- కోటలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

ఖిలావరంగల్, సెప్టెంబరు 21: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు పంటల నష్టపరిహారం, ఇళ్లు, ఆస్తులను కోల్పోయిన పేదలకు తగిన న్యాయం చేస్తామని కేంద్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి జార్జి కురియన్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం ఖిలా వరంగల్ కోటలోని వాకింగ్ గ్రౌండ్‌లో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు భైరి నాగరాజు ఆధ్వర్యంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పంటలను నష్టపోయిన రైతులు, ఇళ్లు, ఆస్తులను నష్టపోయి పేదలకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రాలకు నిధులను అందజేశామన్నారు. ఖిలావరంగల్ కోటలో వంశపారంపర్యంగా సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాదార్ పాసుపుస్తకాలు రాకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న రైతుబంధు పేద రైతులకు అందడం లేదన్నారు. కాగా, దరఖాస్తు చేసుకున్న రైతులకు పట్టాదార్ పాసుపుస్తకాలను అందజేయాలన్నారు. అట్టి నిధులను రాష్ట్ర ప్రభుత్వం వర్షాలకు నష్టపోయిన బాధితులకు అందజేయాలన్నారు. అలాగే ఖిలా వరంగల్ 38వ డివిజన్‌లోని గంగపుత్ర, ముదిరాజ్, కాపువాడలలో ఇంటింటికి తిరుగుతూ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను మంత్రి చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పొలెపాక మార్టిన్ లూథర్, రాష్ట్ర నాయకులు కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, బీజేపీ సీనియర్ నాయకుడు పుప్పాల రాజేందర్, 37, 38 డివిజన్‌ల అధ్యక్షులు నాంద్రె అమర్‌నాథ్, అంకాల జనార్ధన్, నాయకులు సార్ల భారతి, సత్యం, గణేష్, చంద్రమోహన్, గొర్రె కోటి, రాంబాబు, ఇనుముల మూర్తి, తోట జగ్గయ్య, బొళ్ల భిక్షపతి, కుమారస్వామి, రమేష్, గణేష్, లక్క చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వాకింగ్ గ్రౌండ్‌లో రైతులతో బీజేపీ సభ్యత్వ నమోదు చేస్తున్న కేంద్ర మంత్రి కురియన్

శిల్పాలను తిలకించిన కేంద్ర మంత్రి

ఖిలావరంగల్ మధ్యకోటలోని కాకతీయుల కాలంనాటి కీర్తి తోరణాలు, శిల్పకళా ఖండాలు, ఏకశిల గుట్ట, ఖుష్‌మహల్, తదితర కళాఖండాలను కేంద్ర మంత్రి కురియన్ ఆసక్తిగా తిలకించారు. మధ్యకోటలోని అదుభత శిల్ప సౌందర్యాన్ని ఆయన కేంద్ర పురావ స్తు శాఖ, పర్యాటక శాఖ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, గైడ్ రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిండుకున్న ఖజానా

- అప్పుల కుప్పగా మునిసిపాలిటీ
- రూ.కోట్లలో అప్పులు చూపిస్తున్న వైనం
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదులుతున్న డొంక
- పుర అక్రమాలపై కలెక్టర్, ఇంటెలిజెన్స్ ఆరా..

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 21: వర్ధన్నపేట మునిసిపాలిటీని అప్పుల కుప్పగా మార్చారా.. అంటే అవుననే చెబుతున్నాయి అధికారిక లెక్కలు. ప్రస్తుతం ఖజానా నిండుకుందని చెబుతున్నారు. ప్రతి ఏటా నిర్వహించే వార్షిక బడ్జెట్‌లో సైతం ఖర్చులే కనిపించడం గమనార్హం. ఈ ఐదేళ్ల కాలంలో ఇప్పటి వరకు రూ.కోట్లలో అప్పులు ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తున్న విషయం. 16 నెలలకు పైగా ప్రత్యేక అధికారుల చేతుల్లో నడిచిన మునిపాలిటీ అనంతరం పాలకవర్గం ఏర్పడింది. కానీ, బడ్జెట్ సమావేశానికి వెళ్తున్నామా, సంతకాలు చేస్తున్నామా, తిరిగి వస్తున్నామా.. అన్న తీరుగానే పాలకవర్గం ఉన్నట్లుగా తెలుస్తోంది. దీంతో అధికారులు తమ ఇష్టానుసారంగా లెక్కలు చూపిస్తూ ఆదాయం మూరెడు, ఖర్చు బారెడుగా చూపిస్తున్నారు.

పెండింగ్ బిల్లులు, గౌరవ వేతనాలు

పాలకవర్గానికి గత 38 నెలలుగా గౌరవ వేతనాలు ఇవ్వడం లేదు. చైర్మన్‌కు రూ.15,600, వైస్ చైర్మన్‌కు రూ.7,500, కౌన్సిలర్లకు రూ.3,250 ప్రభుత్వం గౌరవ వేతనం ఇచ్చేలా నిర్ణయించింది. కానీ ఇన్ని నెలలుగా వేతనాలు ఇవ్వకుండా అధికారులు దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు. ఇప్పుడు వారి వేతనాలే సుమారు రూ.10లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. దీనికి తోడు ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు చేసిన పనులకు సైతం రూ.2-5 లక్షల వరకు ఇవాల్సి ఉంది. వైస్ చైర్మన్‌కే దాదాపు రూ.20లక్షల వరకు బిల్లులు రావాలని చెబుతున్నారు. దీనికి తోడు వివిధ వార్డుల్లో మునిసిపాలిటీ నిర్వహణ పేరిట పెట్టిన పెట్టుబడి డబ్బులు సైతం రూ.లక్షల్లో రావాల్సి ఉంది. ఇలా ఉండగానే మునిసిపాలిటీ అప్పుల్లో ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఆదాయం మూరెడు, ఖర్చు బారెడు..

పురపాలక సంఘం పరిధిలో జరిగే వివిధ అధికారిక కార్యక్రమాలతో పాటు బడ్జెట్ సమావేశాలు, జెండా పండుగలు, ప్రముఖుల విజిటింగ్‌లు ఇతర చిన్నచిన్న కార్యక్రమాకు సైతం రూ.వేలలో రాయడం కౌన్సిలర్లను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. బడ్జెట్ సమావేశం జరిగితే దాదాపు రూ.75వేలు ఖర్చు చూపినట్లు ఆరోపణలు

మిగతా 8వ పేజీలో..

రేపు విద్యుత్ పోల్ ఎక్కే పరీక్ష

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 21: జూనియర్ లైన్‌మె న్ నియామకం కోసం సోమవారం ములుగురోడ్డులోని ఉత్తర విద్యుత్ శిక్షణ సంస్థ (ఎన్‌పీటీఐ) పోల్ ఎక్కే పరీక్ష నిర్వహిస్తున్నట్లు హనుమకొండ ఎస్ఈ కె. వెంకటరమణ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం 9 గంటల హాజరుకావాలన్నారు. ఎంపిక పూర్తి పారదర్శకంగా ఉంటుందని, ఏలాంటి దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి..

పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

గాంధీ భవనంలో ఉమ్మడి జిల్లా పార్టీ నేతలతో సమావేశం



హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమావేశమైన పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, తదితరులు

హనుమకొండ, సెప్టెంబరు 21, (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. పార్టీలకతీతంగా జరిగే ఈఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులు ఎక్కువ మంది ఎన్నికయ్యేలా గ్రామీణస్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలే ప్రధాన ఎజెండాగా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంకోసం పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, రూపొందించుకోవలసిన కార్యప్రణాళికపై నేతలకు దశదిశా నిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పని చేయనివారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని పరోక్షంగా హెచ్చరించారు. ఎమ్మెల్యే అయినా, ఎంపీ అయినా ఎవరైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం చేసిన కృషి గీటురాయిగా ఉంటుందని, దానిని బట్టే వారికి రాజకీయ భవిష్యత్తు, పార్టీలో సముచిత స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి. సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వీటిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడం ద్వారా గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. ఒక పక్క అభివృద్ధిని కొనసాగిస్తూనే గ్రామీణ స్థాయిలో పార్టీని క్రియాశీలకంగా నిలిపే ప్రక్రియ సమాంతరంగా సాగాలని మహేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. పార్టీపై నిర్లక్ష్యంగా వ్యవహరించేవారి పట్ల కఠిన చర్యలు ఉంటాయన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ కోసం ఎవరు కష్టపడి పని చేసింది? ఎవరు పని చేయనిది మొత్తం వివరాల చిట్టా పార్టీ అధిష్ఠానం దగ్గర ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయానికి గ్రామ స్థాయిలో సమర్థత కలిగిన నేతలను ఇప్పటి నుంచే గుర్తించాలని మహేష్‌కుమార్ ఆదేశించారు.

కాగా, ఇప్పుడున్న కమిటీలన్నిటినీ రద్దు చేయడంతో పాటు కొత్త కమిటీలను సమర్థులైనవారితో నియమించాలన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. ఈ కమిటీల ఏర్పాటులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కూడా భాగస్వామ్యం చేయాలన్న నిర్ణయాన్ని తీసుకున్నట్టు తెలిసింది. లోకల్ బాడీ ఎన్నికలు దగ్గరపడుతున్నందున అభ్యర్థులను నిలబెట్టడానికి ఇప్పటి నుంచే కసరత్తు మొదలు పెట్టాలని ఎమ్మెల్యేలను పార్టీ అధ్యక్షుడు ఆదే శించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తుమీద జరుగుతున్నప్పటికీ సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు మాత్రం పార్టీలతో సంబంధం లేకుండా జరుగనున్నందువల్ల ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పార్టీ నైతిక మద్దతుతో గెలిచే అవకాశం స్థానిక నాయకులను ఎంపిక చేయడంపై దృష్టి సారించాలని సమావేశం సూచించింది. గత ఎన్నికల్లో మెజారిటీ స్థానిక సంస్థలను బీఆర్ఎస్ గెలుచుకున్న నేపథ్యంలో ఈ సారి ఆ పార్టీకి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా సమగ్రమైన కార్యప్రణాళికను రూపొందించుకొని ప్రతిపక్ష పార్టీలకన్నా ఒకింత ముందుండాలని సమావేశం పిలుపు నిచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న మొత్తం 1,688 గ్రామ పంచాయతీల్లో దాదాపు అన్నిటినీ కైవసం చేసుకునేలా సమష్టిగా కృషి చేయాలని పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పిలుపునిచ్చారు. మంత్రి కొండా సురేఖ ఉమ్మడి జిల్లాలో పార్టీ పరిస్థితి, గ్రామీణ స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు భవిష్యత్తులో కానున్న సన్నద్ధతను వివరించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవడం, ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడం, వివిధ స్థాయిలో పార్టీ నేతల మధ్య సమన్వయం సాధించడం ద్వారా స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించగలమన్న విశ్వాసాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యక్తం చేశారు. ఈసమావేశంలో ఏఐసీసీ పక్షాన విశ్వనాథ్, విష్ణునాథ్‌తో పాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనా రాయణ రావు, రాంచంద్ర నాయక్, కేఆర్ నాగరాజు, అశ్వినీరెడ్డి, కడియం శ్రీహరి., ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు రాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయక్, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

రైళ్ల ట్రాఫిక్‌కు ఇక చెక్

ముగిసిన మూడో రైల్వేలైన్ నిర్మాణ పనుల ● వారంలో అందుబాటులోకి.. త్వరలో ట్రయల్ రన్



సొరంగమార్గం ట్రాక్‌వద్ద రిబ్బన్ కట్‌చేస్తున్న సేఫ్టీ ఆఫీసర్ మాధవి

కాజీపేట, సెప్టెంబరు 21: కాజీపేట - హసన్‌పర్తి - వరంగల్ మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణం పూర్తయింది. ఇక నుంచి ఢిల్లీ నుంచి వరంగల్ మీదుగా చెన్నై, ఢిల్లీ నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లే రైళ్ల ట్రాఫిక్‌కు తెర పడనుంది. హసన్‌పర్తి నుంచి వరంగల్, హసన్‌పర్తి నుంచి కాజీపేట వరకు అదనంగా మూడో రైల్వే లైన్ నిర్మాణం పూర్తయ్యింది. 2021లో ప్రారంభమైన ఈ ట్రాక్ నిర్మాణం.. హసన్‌పర్తి నుంచి వరంగల్ వరకు 21 కిలోమీటర్లు, హసన్‌పర్తి నుంచి కాజీపేట వరకు 10 కిలోమీటర్ల మేర ట్రాక్‌నిర్మాణం చేశారు దీంతో బల్లార్ష నుంచి వరంగల్ వైపు, బల్లార్షా నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్ వెళ్లే రైళ్లకు ఎలాంటి అంతరాయం లేకుండా రాకపోకలు సాఫీగా జరుగనున్నాయి. గతంలో న్యూఢిల్లీ నుంచి వరంగల్ వైపు రైలు వెళ్లాలంటే అదే లైన్‌లో కాజీపేట వైపు వెళ్లే రెలును ఆపి వరంగల్ వైపు వెళ్లే రెళ్లను పంపించేవారు. కాజీపేట వైపు రెళ్లను పంపించాలంటే వరంగల్ వైపు వెళ్లే రైలును ఆపాల్సిన పరిస్థితి. దీంతో ప్రతీరోజు గూడ్స్ రైళ్లతో కలిపి సుమారు 150 రైళ్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలగడమే కాకుండా రైల్వేకు అపారమైన నష్టం జరిగేది. ప్రస్తుతం కాజీపేట వైపు అదనంగా మరో ట్రాక్, వరంగల్ వైపు అదనంగా మరో ట్రాక్ నిర్మించడంతో మొత్తంగా ఈ రూట్‌లలో నాలుగు రైల్వే లైన్‌లు ఏర్పడ్డాయి. కొత్తగా నిర్మించిన ట్రాక్‌లను రైల్వే సేఫ్టీ అధికారి మాధవి పరిశీలన పూర్తయ్యింది. మరో రెండు రోజుల్లో కొత్త ట్రాక్‌లపై ట్రయల్ రన్ చేపట్టనున్నారు. అనంతరం ఈ ట్రాక్‌ల మీదుగా పూర్తిస్థాయి రైళ్లను నడపనున్నారు.

ఇదే రూట్‌లో సొరంగ మార్గం

కాజీపేట - హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌ల మధ్య రైల్ అండర్ బ్రిడ్జి (సొరంగ మార్గం) నిర్మాణం ప్రత్యేకం కానుంది. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగకుండా ఈ సొరంగ మార్గంలో సుమారు 340 మీటర్ల బ్రిడ్జిని నిర్మించారు. ఈ బ్రిడ్జి మీదుగా ఒకేసారి రెండు రైళ్లు, బ్రిడ్జి కింద నుంచి మరో రైలు రాకపోకలు సాగించనున్నాయి. ఈనెల 19 నుంచి మూడురోజుల పాటు ఈ రైలు మార్గాలను రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి బృందం పర్యవేక్షించింది. మూడో రైల్వే లైన్‌లు, సొరంగమార్గం ట్రాక్ నిర్మాణంపై ఆమె పూర్తి స్థాయి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి సొరంగమార్గ నిర్మాణాలు మరిన్ని చేపట్టడానికి రైల్వే అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం సేఫ్టీ కమిషనర్ మాధవి బృందం రిబ్బన్ కట్‌చేసి కొబ్బరికాయలు కొట్టి, బ్రహ్మణుల వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు కూడా చేశారు. ప్రయోగాత్మకంగా నిర్మించిన ఈ ట్రాక్‌లు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా ఉండాలని విజయవంతం కావాలని ఆమె కోరుకున్నట్లు తెలిసింది. ఆమె ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తే వెంటనే ట్రయల్ రన్‌చేసి వారం రోజుల్లో ఈ ట్రాక్ మీదుగా పూర్తిస్థాయి రైళ్లను నడపడానికి రైల్వే అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.

బొడ్డెమ్మ బొడ్డెమ్మా.. కోల్..

● ఆడబిడ్డల పండుగ బొడ్డెమ్మ వేడుకలకు సిద్ధమైన పల్లెలు ● రేపటి నుంచి సాగనున్న సంబురం ● తొమ్మిది రోజుల పాటు సందడే సందడి

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 21: తెలంగాణ పల్లెల్లో ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ యువతులు, చిన్నారులు యేటా జరుపుకొనే బొడ్డెమ్మ పండుగ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. కుంటున్నారు. నేటి కంప్యూటర్ కాలంలో కూడా బొడ్డెమ్మను తెలంగాణ ప్రాంతంలో జరుపుకోవడం మన సంస్కృతికి నిదర్శనం. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి అనేక సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించగా ప్రాచీన పండుగగా మొదలయ్యే నాలుగు పండుగల్లో మొట్టమొదటి పండుగ బొడ్డెమ్మ. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడంతో పాటు ప్రోత్సహించకపోవడం వలన భావితరాల వారికి బొడ్డెమ్మ పండుగ తెలియకుండానే కనుమరుగు కానుంది. అయినా నేటికి సంస్కృతి సంప్రదాయబద్ధమైన బొడ్డెమ్మ పండుగను పల్లె, పట్టణ ప్రాంతాలు, నగరాల్లో ఆచరించుకుంటున్నారు. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బొడ్డెమ్మ వేడుకలు మరి కొద్ది గంటల్లో ప్రారంభం కానున్నాయి.

బొడ్డెమ్మ ఎలా ఉంటుంది..?

బొడ్డెమ్మ అనే పదాన్ని అమ్మవారి నామాలలో ఒక నామంగా గుర్తించి బొడ్డెమ్మను పుట్టమన్నుతో తయారు చేస్తారు. ప్రజలు కాలుపెట్టని ప్రాంతానికి చెందిన మట్టి పుట్ట కాబట్టి పుట్ట మన్నును తెచ్చి పీటపై శ్రీచక్ర రూపంలో సహ ప్రాకారంగా గడులతో తయారుచేసి కింది నుంచి వెడల్పు, మీదికి కలశ రూపంలో సన్నగా తయారు చేస్తారు. ఒక ఆకారం తీసుకొచ్చి బొడ్డెమ్మగా రూపు దిద్దుతారు.

పూజా విధానం

ప్రకృతి సిద్ధమైన పుట్టమన్నుతో తయారు చేసిన బొడ్డెమ్మను ఎర్రమన్నుతో అందంగా అలికి చుట్టూరా పిండితో ముగ్గులు వేసి పసుపు బొట్లు, కుంకుమ బొట్లు పెట్టి పూలతో అలంకరిస్తారు. పైన రాగి చెంబును కలశంగా ఏర్పాటు చేసి కింద బొడ్డెమ్మ ముందు మట్టి ప్రమిద దీపాన్ని పెట్టి అగరబతుఉతలు ముట్టించి చిన్నారులు ఆట పాటలతో కీర్తిస్తూ పూజలు నిర్వహిస్తారు.



బొడ్డెమ్మ



బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు (ఫైల్)

ఇంటింటి నుంచి బియ్యం

ప్రతీరోజు సాయంత్రం ఇంటి నుంచి చిన్నారులు ఆట పాటలు నిర్వహించుకోవడానికి బొడ్డెమ్మ వద్దకు బియ్యం, అటుకులు, చక్కర, బెల్లం తెస్తారు. తాము తెచ్చిన బియ్యాన్ని కలశంలో పోసి బొడ్డెమ్మ ఆట పాట నిర్వహించుకున్న అనంతరం అటుకులు, చక్కరను అందరికి ప్రసాదంగా పంచుతారు. తొమ్మిది రోజుల పాటు ఆట పాటలు నిర్వహించుకుంటారు.

ఆఖరి రోజు నిమజ్జనం

తొమ్మిదిరోజులపాటు ఆట పాటలతో బొడ్డెమ్మను భక్తి శ్రద్ధలతో అలంకరించి పూజించి తాము తెచ్చిన బియ్యం, బెల్లాన్ని ఆఖరిరోజు చపాతీ(రొట్టె)లు బెల్లంతో కలిపి లడ్డూలు తయారు చేసి అందరికి ప్రసాదంగా ఇస్తారు. ఆట పాటల అనంతరం వెళ్లి రావమ్మా.. బొడ్డెమ్మా అంటూ.. చెరువులు, కుంటలు, బావుల్లో బొడ్డెమ్మను నిమజ్జనం చేస్తారు.

కనుమరుగు కానున్న బొడ్డెమ్మ

ప్రాచీన పండుగల్లో ఒకటిగా ఉన్న పండుగ బొడ్డెమ్మ. తెలంగాణ ఏర్పాటు అనంతరం పండుగను గుర్తించిన ప్రభుత్వం.. సంప్రదాయమైన బొడ్డెమ్మను మాత్రం గుర్తించకపోవడం శోచనీయం. తరతరాల నుంచి పల్లె, పట్టణ ప్రాంతాల్లో, నగరాల్లో నేటికి నిర్వహించుకుంటున్న ఈ పండుగను గుర్తించకపోవడంతో కనుమరుగు కానుంది. భావితరాల వారికి తెలంగాణ సంస్కృతి పండుగలను అందించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. స్వచ్ఛంద సంస్థలు కూడా అనేక సంప్రదాయ పండుగలను గుర్తించి వేడుకలు నిర్వహించినా బొడ్డెమ్మను కూడా స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంస్థలు గుర్తించకపోవడం నిరాశకు గురిచేస్తోందని పలువురు మహిళలు పేర్కొంటున్నారు.

ఎగ్ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తా..

● కోళ్ల వ్యాధుల నివారణకు త్వరలో వ్యాక్సిన్ ● కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి జార్జి కురియన్

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 21: ఆలిండియా ఎగ్‌బోర్డు ఏర్పాటు కోసం కృషి చేస్తానని కేంద్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ అన్నారు. శనివారం హనుమకొండ అశోకా కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోళ్ల వ్యాధులు నివారణకు వ్యాక్సిన్ తయారు చేయడం చివరి దశకు వచ్చిందని, త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం పౌల్ట్రీ పరిశ్రమల నిర్వాహకులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. ఐఎల్‌టీ, హెచ్‌పీ కారణంగా దేశవ్యాప్తంగా పౌల్ట్రీ ఫామ్స్ మూసివేస్తున్నారని, ఇప్పటికే కేరళ రాష్ట్రంలో సుమారు 14 పరిశ్రమలు మూసివేశారని గుర్తు చేశారు. కేంద్రం ప్రభుత్వం 109 రకాల గడ్డిని పెంచుకోవడానికి అనుమతి ఇచ్చే విధంగా కృషి చేస్తానన్నారు.

వరంగల్ జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. కరోనా కారణంగా పౌల్ట్రీ పరిశ్రమలు నష్టాల్లో కూరుకుపోయాయన్నారు. దేశంలో ఇప్పటికే చాలా వరకు పౌల్ట్రీ ఫామ్‌లు మూసివేస్తున్నారన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం గుడ్ల విక్రయాల్లో మొదటిస్థానంలో ఉండగా, రాజస్థాన్ చివరి వరుసలో ఉందన్నారు. అనంతరం పౌల్ట్రీ ఫార్మర్స్ పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కేంద్ర సహాయ మంత్రికి అందజేశారు. ఈ సమావేశంలో నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వరంగల్ జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేసన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్. ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి ఎం.రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు జి.రమణారెడ్డి, సీహెచ్. రవీందర్, శ్రీరాంనాయక్, ఎం.సుబ్బారావు, టి.శ్యాంసుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్, హీరో చంద్రహాస్

'రాంనగర్ బన్నీ' సినిమాను ఆదరించండి..

మీడియా సమావేశంలో సినిమా దర్శకుడు శ్రీనివాస్ విజ్ఞప్తి

వడ్డేపల్లి, సెప్టెంబరు 21: బుల్లితెర నటుడు ప్రభాకర్ తనయుడు చంద్రహాస్ హీరోగా పరిచయం అవుతున్న రాంనగర్ బన్నీ చిత్రాన్ని సమాజంలోని ప్రతీ ఒక్కరు ఆదరించాలని సినీ డైరెక్టర్ శ్రీనివాస్ కోరారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు హీరో చంద్రహాస్ మాట్లాడారు. ఈ సినిమా ప్రతీ ఒక్కరు చూసి ఎంజాయ్ చేసేలా ఉంటుందని అన్నారు. కామెడీ, సాంగ్స్, ఫైట్స్ అందరికీ నచ్చే విధంగా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సినిమా వసూళ్లలో 10శాతం వరద బాధితుల సహాయార్థం రెండు తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్స్‌కు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. తెలుగు ప్రజలు అందరు ఆదరిస్తే ఈ సినిమా విజయవంతం అవుతుందని కోరారు. ఈ సినిమా అక్టోబరు 4న విడుదలవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బుల్లితెర నటుడు ప్రభాకర్, హీరోయిన్లు విస్మయశ్రీ, రిచాజోషి తదితరులు పాల్గొన్నారు.

నేడు పొలిటికల్ సైన్స్ అలూమ్నీ మీట్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 21: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం 'ది గ్రేట్ రీ యూనియన్' పేరుతో ఆదివారం నిర్వహిస్తున్నట్లు కేయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, సీనియర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం శనివారం తెలిపారు ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ మాట్లాడుతూ.. సెప్టెంబరు 22న ఆదివారం ఉదయం 10.30 గంటలకు కేయూ క్యాంపస్‌లోని పొలిటికల్‌సైన్స్ విభాగంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగుతోందని చెప్పారు. రాష్ట్ర గ్రంథాలయం సంస్థ చైర్మన్, పొలిటికల్ సైన్స్ విభాగం పూర్వ విద్యార్థి డాక్టర్ మహ్మద్ రియాజ్, పొలిటికల్‌సైన్స్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్లు రఘురాంరెడ్డి, సమ్మాలాల్, సంజీవరెడ్డి, వీరన్న, హరిప్రసాద్, దినేశ్‌కుమార్‌లతో పాటు పొలిటికల్‌సైన్స్ విభాగం బీవోఎస్ చైర్మన్ డాక్టర్ కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ వడ్డెపల్లి నాగరాజు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు హాజరుకానున్నారు. పూర్వ విద్యార్థులందరూ హాజరుకావాలని కోరారు.

క్యాంపస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

కేయూ క్యాంపస్‌లోని రాజనీతిశాస్త్రవిభాగంలో ఆదివారం జరిగే పూర్వ విద్యార్థుల సమ్మేళనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కేయూ క్యాంపస్‌లోని హ్యుమనిటీస్ బిల్డింగ్‌ను సర్వాంగసుందరంగా అలంకిరించారు ప్రత్యేక ఆహ్వాన ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో పొలిటికల్ సైన్స్ పూర్వ విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రధానంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి పెద్దఎత్తున పూర్వ విద్యార్థులు పాల్గొంటారు.

రైలు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన శశిధర్

హసన్‌పర్తి, సెప్టెంబరు 21: రైలు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన ఎల్లాపూర్ రైల్వేస్టేషన్‌లో శనివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకా రం.. కుమ్రంభీం జిల్లా బెజ్జూరు మండల కేంద్రానికి చెంది న కొల్లంపాక శశిధర్ శనివారం ఉదయం ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో హసన్‌పర్తికి వస్తున్నాడు. ఈ క్రమంలో హస న్‌పర్తి మండల ఎల్లాపూర్ రైల్వే స్టేషన్‌లో నెమ్మదిగా వెళ తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు దిగుతుండగా కిందపడ గా తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో రక్తస్రావం కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. వెంటనే 108 సిబ్బంది బాధితుడిని ప్రథమ చికిత్స అందించి ఎంజీఎంకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించినట్లు బాధితుడి బంధువు హసన్‌పర్తికి చెందిన కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ తెలిపారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

కేయూ డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ ఫీజు గడువు 26

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 21: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న బీఏ, బీకాం, బీఎస్సీతోపాటు ఇతర కోర్సుల 1, 3, 5 సెమిస్టర్‌ల పరీక్షల ఫీజులను సెప్టెంబరు 26 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో అక్టోబరు 5వ తేదీ వరకు ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

గొర్రెల కాపరి మృతదేహం లభ్యం

ఐనవోలు, సెప్టెంబరు 21: గొర్రెల కాపరి మృతదేహం లభ్యమైన సంఘటన కక్కిరాలపల్లి గ్రామంలో వెలుగుచూసింది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం కక్కిరాలపల్లికి చెందిన పిట్టల రాజు (26) అనే యువకుడు గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. మూడు రోజుల కిందట గొర్రెలను తోలుకపోయిన రాజు.. సాయంత్రం ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు గాలించిన అచూకీ లభించ లేదు. గ్రామంలోని ఒక పాత ఇంటి నుంచి దుర్వాసన వస్తుందని భావించి ఇరుగు పొరుగు వారు వెళ్లి చూశారు. రాజు అప్పటికే మృతిచెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా కుళ్లిపోయిన మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడికి మద్యం తాగే అలవాటు ఉందని మద్యం సేవించాక తాగడానికి నీళ్లు లభించక మృతిచెందినట్లు భావిస్తున్నారు. తన కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని తండ్రి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక మృతికిగల కారణాలు తెలుస్తాయని ఎస్సై తెలిపారు. కాగా, మృతుడు అవివాహితుడు.



బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు

కాశిబుగ్గ, సెప్టెంబరు 21: మహిళలు బతుకమ్మ ఆడటానికి వీలుగా ఉండే విధంగా 19వ డివిజన్‌లోని దూసకుంట(రామ సముద్రం) వద్ద కార్పొరేషన్ అధికారులు శనివారం ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ ప్రాంతంలో కబ్జాలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళికి స్థానికులు కొద్ది రోజుల క్రితం ఫిర్యాదు చేయగా, ఆయన పర్యటించారు. ఆ సమయంలో బతుకమ్మ ఆడటానికి ఏర్పాట్లు చేయాలని అక్కడి మహిళలు కోరిన విషయం తెలిసిందే. ఈ మేరకు కార్పొరేషన్ అధికారులు కుంట ప్రాంతాన్ని శుభ్రం చేసే పనులు మొదలు పెట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జ్ అంబి సాంబరాజు, హరిప్రసాద్, శేషు, సుల్తాన్ సమ్మక్క, రాజమణి, ప్రభాకర్, వెంకన్న పాల్గొన్నారు.



భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న చిత్ర యూనిట్

అమ్మవారి సన్నిధిలో రాంనగర్ బన్నీ చిత్రయూనిట్

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 21: బుల్లితెర నటుడు ప్రభాకర్ తనయుడు చంద్రహాస్, విస్మయశ్రీ, రిచాజ్యోషి నటీనటులుగా నటించిన రాంనగర్ బన్నీ సినిమాకు చెందిన చిత్రం యూనిట్ సభ్యులు శనివారం నగరంలోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. తొలిసారి హీరోగా నటించిన రాంనగర్ బన్నీ చిత్రం విజయవంతం కావాలని అమ్మవారిని వేడుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దర్శకుడు శ్రీనివాస్, మలయజ ప్రభాకర్, నిర్మాతలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 21: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులైన మూత్రశాలలు నిర్మించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు శనివారం జిల్లా కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్ మాట్లాడుతూ వర్ధన్నపేట మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలకు ఐదెకరాలు కేటాయించి అందులోనే శాశ్వత అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలతో భవనం నిర్మించాలన్నారు. రాయపర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక హెల్త్ సెంటర్‌లో పర్మినెంట్ డాక్టర్‌ను నియమించి, వైద్య సిబ్బందిని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మేకల సుమన్, సాయిబాబా, రొడ్డ మురళీకృష్ణ, రవి, శ్రవణ్, బాబు, యాకూబ్, విష్ణు, తిరుపతి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

▸▸ 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ



మాట్లాడుతున్న కార్పొరేటర్ పోశాల పద్మ

శంభునిపేట, సెప్టెంబరు 21: విద్యార్థులు కష్టపడి చదువుకొని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మస్వామి అన్నారు. నగరంలోని శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అధ్యక్షతన శనివారం తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ పోశాల పద్మతో పాటు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ మండల పరుశరాములు పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు చెమటోడ్చి చదివిస్తున్నారని పిల్లలు గుర్తుంచుకోవాలన్నారు. లక్ష్య సాధనతో చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలబడాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పిల్లల విద్య పట్ల శ్రద్ధ చూపి ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

▸▸ సమీక్షలో కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 21: రైతులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్నే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సత్యశారద సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం 2లక్షల 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. 203 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, తేమ సాంద్రత కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో సన్నరకం ధాన్యం ఎక్కువగా సాగు చేశారని, ఈ సంవత్సరం వ్యవసాయ శాఖ అధికారులు ఆయా మండలాల వారీగా ధాన్యం పండించిన రైతుల వివరాల నివేదిక అందించాలన్నారు. ధాన్యం తూకం విషయంలో అవకతవకలు జరగకుండా చర్యలు చేపట్టాలని, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ సీల్స్ పరిశీలించాలని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసేందుకు సౌకర్యం కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సివిల్ సప్లై డీఎం సంధ్యారాణి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఉమారాణి, డీఎం సురేఖ, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీసీవో నీరజ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారు

▸▸ కేంద్ర మంత్రి జార్జి కురియన్



ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కురియన్

మిల్స్‌కాలనీ(వరంగల్), సెప్టెంబరు 21: తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారని కేంద్ర మత్స్యకార, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి జార్జి కురియన్ అన్నారు. శనివారం విశేష్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వరంగల్‌లోని కే కన్వెన్షన్‌లో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 17 లక్షలకు పైగా ఓట్లు రాగా, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 36లక్షలకు పైగా ఓట్లు వచ్చాయన్నారు. కాగా, రానున్న కాలంలో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురుతుందన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయిలో ఇంటింటికి వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చేయించాలన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పవిత్ర కార్యంగా భావించాలని, వేడుకగా మార్చాలన్నారు. బీజేపీ కార్యకర్తల మనోభావాలు దేశభక్తితో ప్రేరణ పొందాయని, భరతమాత సంక్షేమం, 140 కోట్ల మంది దేశ ప్రజల సంక్షేమం కోసం నిబద్ధమై ఉన్నామన్నారు. కొత్తవారిని సభ్యులుగా చేర్చుకొని వారికి ఉపకారం చేశామని భావన కలిగించకూడదని, దేశ ప్రయోజనాల కోసం వారు ముందుకు రావడం మనకు గర్వకారణమని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ ప్రముఖ్, మాజీ శాసన సభ్యుడు మార్తినేని ధర్మారావు, వరంగల్ జిల్లా సభ్యత్వ ప్రముఖ్ కుసుమ సతీష్, విశేష్ సంపర్క్ అభియాన్ ప్రముఖ్ రత్నం సతీష్‌షా, సంయుక్త మోర్చాల సభ్యత్వ ప్రముఖ్ వన్నాల వెంకటరమణ, నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

▸▸ జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పుష్పలత

శంభునిపేట, సెప్టెంబరు 21: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదిగి స్వయం సమృద్ధి చెందాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పుష్పలత అన్నారు. నగరంలోని శంభునిపేటలో శనివారం కామాక్షి విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహిళా పొదుపు, సహకార సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘం అధ్యక్షురాలు గుగ్గిళ్ల శశిరేఖ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పుష్పలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని అభివృద్ధి దిశలో పయనించాలన్నారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనసూరి చంద్రమౌళి, కేయూ రీడర్ కొక్కొండ చంద్రకళ, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ విశ్వకర్మ మహిళలు 150 మందితో పొదుపు సంఘాన్ని ఏర్పాటు చేసుకొని ఒకరికొకరు సహకారం అందించుకుంటూ పరపతిని పెంచుకోవం అభినందనీయం అన్నారు.

పురుషులతో సమానంగా సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. మారుతున్న సాంకేతిక యుగానికి అనుగుణంగా మహిళా శక్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. వార్షిక నివేదిక అనంతరం రాష్ట్ర నాయకుల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కామాక్షి విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహిళా సంక్షేమ సహకార పరపతి సంఘం అధ్యక్షురాలిగా గుగ్గిళ్ల శశిరేఖ, ప్రధాన, సహాయ కార్యర్శులుగా రుద్రోజు భవాని, పెండోట రమాదేవి, కోశాధికారిగా నీలోజు అరుణ, ఉపాధ్యక్షులుగా చెంగెల్లి హేమలత, చొల్లేటి వెంకటలక్ష్మి, కర్ణకంటి భారతి, కార్యదర్శులుగా వంగాల కల్పన, మడుపు మంజుల, కొక్కొండ లావణ్య, మట్టెవాడ ఉమ, కార్యవర్గ సభ్యులుగా దుద్దుకూరి పుష్పలీల, పిన్నోజు శ్రీదేవి, పోతుగంటి ఈశ్వరమ్మ, చిలుకూరి రజినీ, గుంటోజు పావని ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

ఆల్ ఇండియా కాటన్ కాన్ఫరెన్స్‌కు హాజరైన బొమ్మినేని

వరంగల్ సిటీ, సెప్టెంబరు 21: మహారాష్ట్ర ఔరంగాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఆల్ ఇండియా కాటన్ కాన్ఫరెన్స్‌కు తెలంగాణ కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. కాటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, మహారాష్ట్ర కాటన్ జిన్నర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆల్ ఇండియా కాటన్ కాన్ఫరెన్స్‌కు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఎక్స్‌పోర్టర్స్, స్పిన్నింగ్ మిల్లర్స్, వ్యాపార ప్రతినిధులు హాజరై గత ఏడాది పత్తి ఎంత వచ్చిం, ఎక్స్‌పోర్ట్స్, ఇంపోర్ట్స్ ఎంత అయ్యాయి, రాబోయే కాటన్ సీజన్‌లో క్రాప్ అంచనా, మద్దతు ధరలు, ఇంటర్నేషనల్ మార్కెట్ గురించి కూలంకషంగా చర్చించారు. ఈ ప్యానెల్ డిస్కర్షన్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేష్ హాజరై రాష్ట్రంలో కాటన్ క్రాప్‌కు సంబంధించిన అంశాలను వివరించారు.



నేడు భారీ గణనాథుడి నిమజ్జనం

మట్టెవాడ, సెప్టెంబరు 21: వరంగల్ ఎల్లం బజారులో మొదటిసారిగా 40 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ భారీ గణనాథుడి విగ్రహాన్ని రాగడిమట్టి, గడ్డి, ఇసుక, కర్రలతో రూపొందించారు. 15 రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథుడిని ఆదివారం విగ్రహం ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకుడు ఆకుతోట సంజు తెలిపారు. 15 రోజుల పాటు నిత్య పూజలు, గణపతి హోమాలు, వేలాది మంది భక్తుల ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడికి ఆదివారం పూర్ణాహుతి నిర్వహించి నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

సంక్షేమ పథకాలను ప్రభుత్వమే అందించాలి

ఖిలావరంగల్, సెప్టెంబరు 21: భవన నిర్మాణ రంగ కార్మికులకు అన్ని వసతులు, హక్కులు అడ్వైజరీ బోర్డు ద్వారానే అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నాయకుడు ఆరెళ్లి కృష్ణ అన్నారు. శనివారం ఖిలావరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం సహజ మరణానికి బీమా కింద రూ.6.30 లక్షల నుంచి రూ.5 లక్షలకు, శాశ్వత అంగవైకల్యానికి రూ.5లక్షల నుంచి రూ.4 లక్షలకు కుదించిందన్నారు. ఆగస్టు 21న ఇన్సూరెన్సు కంపెనీలను టెండర్లకు పిలుస్తున్నామని ప్రకటించారన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రైవేట్ కంపెనీలకు కాకుండా ప్రభుత్వమే సంక్షేమ వసతులను అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కంజర్ల బాబు, నందనం కుమారస్వామి, కుసుమ రమేష్, పిట్టల మల్లేశం, బోళ్ల నగేష్ పాల్గొన్నారు.

నిండుకున్న ఖజానా

5వ పేజీ తరువాయి

వినిపిస్తున్నాయి. ఇలా మరెన్నో కార్యక్రమాలకు ఇష్టారీతిన డబ్బులు డ్రా చేశారని తెలుస్తోంది. రూ.లక్ష లోపు పాలకవర్గం సంతకాలు లేకుండా డబ్బులు డ్రా చేసుకునే వెసులుబాటు ఉండడంతో మునిసిపాలిటీలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.

కలెక్టర్, ఇంటెలిజెన్స్ ఆరా...

మునిసిపాలిటీలో 'రూ.6కోట్ల అక్రమాలు' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనంతో అధికారుల డొంక కదులుతోంది. జిల్లా కలెక్టర్ సత్యశారద మునిసిపాలిటీ కమిషనర్‌కు ఫోన్ చేసినట్లు సమాచారం. ఇంటెలిజెన్స్ అధికారులు సైతం అక్రమాల వివరాలను, అవినీతి చేసిన అధికారులపై దృష్టి సారించి వివరాలు సేకరిస్తున్నారు. ఇటు కథనంపై పలు రంగాల వ్యక్తులు, పట్టణ వాసులు, కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయని దృష్టికి తీసుకువస్తున్నారు.

మాదకద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

▸▸ నార్కొటిక్స్ డిపార్ట్‌మెంట్ డీఎస్పీ సైదులు



వరంగల్ సిటీ, సెప్టెంబరు 21: మాదక ద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని వరంగల్ జిల్లా నార్కొటిక్స్ డిపార్ట్‌మెంట్ డీఎస్పీ సైదులు సూచించారు. శనివారం వరంగల్ వ్యవసాయ కళాశాలలో ఏడీ బలరాం ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన, వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ సైదులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకుని ముందుకుసాగాలని, అంతే తప్ప చెడు వ్యసనాలు, డ్రగ్స్ వినియోగం లాంటి వాటికి బానిసై భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని తెలిపారు. మాదక ద్రవ్యాల క్రయవిక్రయాలు, వాడకం లాంటివి కంటపడితే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ పి.రవీందర్, ఎస్ఐ రాజు, సైకియాట్రిస్టు డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కరీమాబాద్, సెప్టెంబరు 21: సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనపై శనివారం మిల్స్‌కాలనీ పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ పి.మల్లయ్య మాట్లాడుతూ గంజాయి నిర్మూలన, అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గంజాయికి బానిసై యువత తమ జీవితాన్ని బలిచేసుకోవద్దని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్లు పలు రకాలుగా ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తుంటారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల విషయమై హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మిల్స్‌కాలనీ ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి

▸▸ పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

ఆటోనగర్, సెప్టెంబరు 21: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చేనేత జౌళి శాఖ మాజీ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడలో కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుండు ప్రభాకర్ హాజరై కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. చేనేత కార్మికులకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట అవార్డులు ఇవ్వడం గర్వకారణమన్నారు. టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కాలేజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ప్రతిపాదించి పద్మశాలీల పట్ల తన అంకితభావాన్ని చాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, మండల శంకర్, పంతగాని శ్రీనివాస్, కొలిపాక మదనయ్య, పిట్ట రాములు, ఒడ్నాల నరేందర్, గోరంట్ల రాజు, బాసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓ సిటీ కూడలిలో..

కాశిబుగ్గ : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా పలు సంఘాల నేతలు నివాళులర్పించారు. వరంగల్‌లోని ఓ సిటీ కూడలిలో లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు.

కార్యక్రమంలో అకెన వెంకటేశ్వర్లు, చెరువుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర సభ్యుడు మురళీకృష్ణ, సత్యనారాయణ, శ్రీనివాస్, మాటేటి అశోక్ కుమార్, ఎల్లయ్య, కాంగ్రెస్ నేతలు దాసరి రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి

▸▸ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్

మట్టెవాడ, సెప్టెంబరు 21: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం వరంగల్‌లోని ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పొట్టి శ్రీరాములు పాల్గొని గాంధీ అనుచరుడిగా పేరుందని, ఆర్యవైశ్య ముద్దుబిడ్డగా కులమతాలకు అతీతంగా అనేక ఉద్యమాలు చేపట్టిన మహనీయులని కొనియాడారు. తెలుగు భాషా రాష్ట్రాల్ని ఏర్పాటు చేయాలని ఒకే భాష మాట్లాడే వాళ్లంతా ఒకే రకంగా ఉండాలనే భావనతో 56 రోజుల పాటు ఆమరణ దీక్ష చేపట్టిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని గుర్తుచేశారు. పొట్టి శ్రీరాములు పేరును తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టాలని, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించాలని, మండల కేంద్రాల్లో సైతం నిరసన చేపట్టాలని, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో నాగేంద్రబాబు, శ్యాంబాబు, రాజ్‌కుమార్, వీరభద్రయ్య, మురళీధర్, పరమేశ్వర్, సీతారాం, గణేష్, రఘుబాబు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ భవన్‌కు తరలిన కాంగ్రెస్ నేతలు

వరంగల్ సిటీ, సెప్టెంబరు 21: టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేష్‌కుమార్ గౌడ్ శనివారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో తొలిసారి కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. మంత్రి కొండా సురేఖ ఆదేశానుసారం 200 మంది ముఖ్య నాయకులు 25 వాహనాల్లో గాంధీ భవన్‌కు తరలివెళ్లారు. ఇందులో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీలో కష్టకాలంలో చురుకుగా పనిచేసిన నాయకులను గుర్తించి తగిన పదవులను అప్పగిస్తామని ప్రకటించారు. పార్టీని, ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, గోపాల నవీన్‌రాజ్, ఎండి.ఆయూబ్, జారతి రమేష్, ఎలగం సత్యనారాయణ, తోట హరీష్, వేణు, సదానందం తదితరులు పాల్గొన్నారు.



గాంధీ భవన్ ముందు జిల్లా ముఖ్య నాయకులతో కాంగ్రెస్ నేతలు

మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలి

▸▸ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి



మహిళా కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 21: మహిళలపై పెరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి అన్నారు. శనివారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని బట్టల బజార్, వరంగల్ చౌరస్తా, బీట్ బజార్ ప్రాంతాల్లో వివిధ షాపుల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులను కలిసి సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ పని నిర్వహించే ప్రదేశాల్లో మహిళలపై కొనసాగుతున్న వివక్షతను రూపుమాపాలన్నారు. మహిళలకు భద్రత కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ తరఫున డిమాండ్ చేశారు. మహిళా కార్మికులకు కనీస వేతనం, పని భద్రత, సర్వీసు, బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ లాంటివి వర్తించకుండా యాజమాన్యం అతితక్కువ వేతనాలతో శ్రమను దోచుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

మహిళా కార్మికులపై వేధింపులు జరుగకుండా చూడడంతో పాటు యాజమాన్యాలు వేతనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్మికులు ఉమ, సరిత, అనసూయ, పద్మ, స్వర్ణలత, పల్లవి, సుజాత, అపర్ణ, రమాదేవి, సుధారాణి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు

▸▸ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్

శంభునిపేట, సెప్టెంబరు 21: సమాజంలో నెలకొని ఉన్న రుగ్మతలను పారద్రోలిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అని నగరంలోని రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ అన్నారు. కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 162వ జయంతి వేడుకలను శనివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కన్యాశుల్కం నాటికలో గిరీశం పాత్రతో సమాజంలో చైతన్యం కలిగించి తీసుకువచ్చిన మార్పును మరవలేమని అన్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్.. అంటూ తన కవితలు, రచనల ద్వారా ప్రజల్లో ధైర్య సాహసాలు నూరిపోశారన్నారు. అంతకుముందు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జె.శ్రీనివాసులు, అధ్యాపకులు డాక్టర్ పీఎల్ఎన్ మూర్తి, శ్రీధర్, శైలజ, చారి, భగీరథ్, సుస్మిత, రమేష్, కృష్ణవేణి, రాజన్న, షరీఫ్ పాషా, గీత, సమీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

గిర్మాజీపేట, సెప్టెంబరు 21: విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయిలో రాణించడంలో తల్లి దండ్రుల పాత్ర కీలకమనే విషయాన్ని గుర్తించి తమ పిల్లలతో ఆత్మీయ అనుబంధాన్ని పెంచుకోవాలని ఇస్లామియా విద్యా కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. వెంకట్‌రాంరెడ్డి అన్నారు. శనివారం వరంగల్‌లోని శ్రీకృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెడ్‌మాస్టర్ జి.అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ పిల్లలు, తల్లిదండ్రుల మధ్య ప్రేమానురాగాలు ఉండాలని అన్నారు. పిల్లలకు తమ తల్లిదండ్రులే ఆదర్శమని, ఇందుకు గాను తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా పిల్లలతో వ్యవహరించాలని కోరారు. పిల్లల చదువుతో పాటు వారి స్నేహితులు, వ్యక్తిత్వం, అలవాట్లు, ప్రవర్తనపై దృష్టి పెట్టి తప్పుడు మార్గాల వైపు ప్రభావితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని చెప్పారు. ఈ విషయంలో పాఠశాల ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలని సూచించారు. పిల్లలు-తల్లిదండ్రుల బాధ్యత, కుటుంబంపై ఆయన తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మస్నా వెంకటేశ్వర్లు విద్యార్థులకు జ్వరాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థుల ఫార్మెటివ్ 1 పరీక్షా ఫలితాలను తల్లిదండ్రులకు అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పొలంబాట ద్వారా రైతుల సమస్యల పరిష్కారం

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 21: విద్యుత్ సమస్యల పరిష్కారానికి చేపట్టిన పొలంబాట ద్వారా జిల్లాలోని రైతులకు సంబంధించిన విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నామని వరంగల్ ఎస్ఈ మధుసూదన్‌రావు తెలిపారు. వంగిన పోల్స్ లూజ్‌లైన్‌లు, మిడిల్ పోల్స్ తీగల మధ్య అవసరం ఉన్న చోట స్పేసర్స్ అమర్చుతున్నామన్నారు. రైతులు ఆటోస్టాటర్లను తొలగించి మోటార్ల జీవితకాలం పెంచుకోవాలన్నారు. కెపాసిటర్లు ఏర్పాటు చేసుకుంటే మోటార్ల జీవితకాలం పెరుగుతుందన్నారు. రైతులకు విద్యుత్ సమస్యలుంటే వెంటనే 1912నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా రైతులు స్వయం మరమ్మతుల చేయరాదని ఎస్ఈ పేర్కొన్నారు.



నిండుకున్న ఖజానా

(5వ పేజీ తరువాయి)

వినిపిస్తున్నాయి. ఇలా మరెన్నో కార్యక్రమాలకు ఇష్టా రీతిన డబ్బులు డ్రా చేశారని తెలుస్తోంది. రూ.లక్ష లోపు పాలకవర్గం సంతకాలు లేకుండా డబ్బులు డ్రా చేసుకునే వెసులుబాటు ఉండడంతో మునిసిపాలిటీలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.

కలెక్టర్, ఇంటెలిజెన్స్ ఆరా...

మునిసిపాలిటీలో 'రూ.6కోట్ల అక్రమాలు' అంటూ 'ఆంధ్ర జ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనంతో అధికారుల డొంక కదులుతోంది. జిల్లా కలెక్టర్ సత్యశారద మునిసిపాలిటీ కమిషనర్‌కు ఫోన్ చేసినట్లు సమాచారం. ఇంటెలిజెన్స్ అధికారులు సైతం అక్రమాల వివరాలను, అవినీతి చేసిన అధికారులపై దృష్టి సారించి వివరాలు సేకరిస్తున్నారు. ఇటు కథనంపై పలు రంగాల వ్యక్తులు, పట్టణ వాసులు, కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయని దృష్టికి తీసుకువస్తున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై



పెద్దకోర్పోలు కస్తూర్బా గురుకులంలో మాట్లాడుతున్న ఎస్సై మహేందర్

నెక్కొండ, సెప్టెంబరు 21: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మహేందర్ సూచించారు. నెక్కొండ మండలంలోని పెద్దకోర్పోలు గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి తెలియజేయకూడదని అన్నారు. విద్యకు, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సెలవుల్లో ఇంటికి వెళ్లిన విద్యార్థులు సెల్ ఫోన్‌లను వినియోగించవద్దని, ఈ విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంటువ్యాధుల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అత్యవసర సమయాల్లో సైబర్ నేరాలపై టోల్‌ఫ్రీ నంబరు 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసలు అయితే బంగారు భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందన్నారు. సమావేశంలో గురుకుల పాఠశాల ప్రత్యేకాధికారి సరిత, ఉపాధ్యాయులు విజయశ్రీ, సునిత, రజిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు తల్లిదండ్రులు సహకరించాలి

దుగ్గొండి: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని మహ్మదాపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కాళీదాసు అన్నారు. మండలంలోని మహ్మదాపురం, దుగ్గొండి ఉన్నత పాఠశాలల్లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎంలు కాళీదాసు, రామస్వామి మట్లాడుతూ ప్రతీ రోజు విద్యార్థి పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ఉపాధ్యాయులు బోధనను పరిశీలన చేయాలని, విద్యార్థులు హోంవర్క్ చేసే విధంగా తల్లిదండ్రులు చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, బాబు, ఊర్మిళ, రాందాసు, రమేశ్ తల్లిదండ్రులు మౌనిక, శ్యామ్, చంద్రశేఖర్, భాగ్యలక్ష్మి, కమలమ్మ, సందీప్ పాల్గొన్నారు.

కాపులకనపర్తిలో రైస్ మిల్లులపై దాడులు

సంగెం, సెప్టెంబరు 21: ప్రభుత్వం అందించిన వరి ధాన్యంను బియ్యం(సీఎంఆర్)గా చేసి తిరిగి ప్రభుత్వానికి అందించాలన్న ఉద్దేశ్యంతో రైస్‌మిల్లులకు 2022-23లో ఖరీఫ్, రబీలకు గాను కేటాయించిన వరిధాన్యం మాయమైన సంఘటన అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. అధికారులు తెలిపిన ప్రకారం.. సంగెం మండలంలోని కాపులకనపర్తి గ్రామంలో గల రెండు రైస్ మిల్లులపై శనివారం సివిల్ సప్లై, టాస్క్‌ఫోర్స్ అధికారులు మూకుమ్మడి దాడులు నిర్వహించారు. శ్రీసాయి ఇండస్ట్రీస్‌లో 2,588 మెట్రిక్ టన్నుల వరిధాన్యం విలువ రూ.8కోట్ల 65 లక్షల 80వేల 486 కాగా, సతీష్ ఇండస్ట్రీస్‌లో 3,951 మెట్రిక్ టన్నుల వరిధాన్యం విలువ రూ.13 కోట్ల 21 లక్షల 87 వేల 49 ఉన్నట్లు అధికారులు తెలిపారు. దీంతో రెండు మిల్లుల యాజమానులపై పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సంధ్యారాణి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై నరేష్ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

'బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలి'

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 21: నర్సంపేట పట్టణంలో బస్తీ దవాఖానా ఏర్పాటు కోసం శివాంజనేయ దేవాలయం సమీపంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి క్వార్టర్స్‌లో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజిని కోరారు. మునిసిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బస్తీదవాఖానా ఏర్పాటు కోసం వినియోగంలో లేని పాఠశాల, కమ్యూనిటీ హాల్స్‌లో ఏర్పాటు చేసి మరమ్మత్తుల కోసం కలెక్టర్ రూ.13 లక్షలు మంజూరు చేశారన్నారు. ఇందుకోసం తరగతులు నిర్వహించకుండా ఖాళీగా ఉన్న అంగడి గ్రౌండ్‌లోని ప్రాథమిక పాఠశాలను గుర్తించి పలుమార్లు డీఈవోకు మునిసిపల్ కమిషనర్ ప్రతిపాదనలు పంపగా నిరాకరించారన్నారు. దీంతో శివాంజనేయ దేవాలయం సమీపంలోనున్న వినియోగంలో లేని ప్రభుత్వ ఆస్పత్రి క్వార్టర్స్‌లో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సమావేశంలో భాంజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతుకు పట్టాబుక్కు అందజేత

పర్వతగిరి, సెప్టెంబరు 21: తాను బతికి ఉండగానే మరణించాడని ధృవీకరించి తన భూమిని గత తహసీల్దార్ ఇతరుల పేరుపై పట్టా చేశారని మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన ఎర్రం మల్లయ్య అనే రైతు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ప్రస్తుత తహసీల్దార్ వెంకటస్వామి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టి 1.25 ఎకరాల భూమికి గాను 25 గుంటల భూమిని మల్లయ్య పేరుపై రికార్డుల్లో ఎక్కించి పట్టాలో నమోదు చేయించారు. శనివారం దానికి సంబంధించిన పత్రాలను రైతుకు అందించారు. మిగతా ఎకరం భూమిని సైతం త్వరలోనే పట్టాలోకి ఎక్కిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈసందర్భంగా రైతు మల్లయ్య తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రజిని

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 21: నర్సంపేట పట్టణంలో మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజిని అన్నారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో నీటి సరఫరాపై అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో మిషన్ భగీరథ లీకేజీలు, మెయిన్ పైపులైన్ నుంచి నీటి సరఫరా లేకపోవడం, పట్టణంలో కొన్ని ప్రాంతాలకే భగీరథ నీరు సరఫరా కావడం తదితర అంశాలపై చర్చించారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలకు నీరు అందేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ జోనా, మిషన్ భగీరథ ఏఈ వంశీ, కె.రాజేష్, సంపత్, లింగు స్వామి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి

రాయపర్తి, సెప్టెంబరు 21: విద్యుత్ వినియోగదారుల సమస్యలను అధికారులు, సిబ్బంది సకాలంలో పరిష్కరించేలా కృషి చేయాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలచారి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన వినియోగదారుల పరిష్కార వేదికలో పాల్గొని మాట్లాడుతూ విద్యుత్ మీటర్ రీడింగ్‌లు సకాలంలో తీయాలన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించకపోతే తగిన ఆధారాలతో బాధితులు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ మధుసూదన్‌రావు, డీఈ భిక్షపతి, ఏడీఈ కన్న రాజు, ఏఈలు రవళి, నిఖిల్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ప్రజలకు న్యాయం చేయాలి : డీసీపీ

నల్లబెల్లి, సెప్టెంబరు 21: పోలీసులు చట్టపరంగా ప్రజలకు న్యాయం చేయాలని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ అన్నారు. శనివారం నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ సందర్శించి తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను శాంతియుతంగా పరిష్కరించాలని సూచించారు. రికార్డులు తనిఖీ చేశారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై తూముల ప్రశాంత్‌బాబు, పోలీసులు శ్రీనివాస్, సురేష్, రాకేష్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

పర్వతగిరి, సెప్టెంబరు 21: గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ వెల్లడించారు. ఈనెల 20వ తేదీన ఎస్సై ప్రవీణ్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా మూడు చక్రంతండాకు వెళ్లే దారిలో ఉన్న చిన్నగుట్ట వద్ద ఇద్దరు వ్యక్తులు, పర్వతగిరికి చెందిన అక్కల నితిన్, అన్నారం గ్రామానికి చెందిన ముంజంపల్లి కార్తీక్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా బ్యాగులో రూ.20,950 విలువ గల 838 గ్రాముల గంజాయి ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద గంజాయి కొనుగోలు చేసి సేవించిన ముంజాలకుంట తండాకు చెందిన తరుణ్, మోత్యాతండాకు చెందిన జగన్ పరారీలో ఉండడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, తరలించినా సంబంధిత సమాచారాన్ని పోలీస్‌స్టేషన్ 8712685028 నంబరుకు తెలియజేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎస్సై ప్రవీణ్, సిబ్బంది రాజు పాల్గొన్నారు.

సహకార సంఘంపై విచారణ జరిపించాలి

చెన్నారావుపేట, సెప్టెంబరు 21: చెన్నారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 67వ వార్షిక మహాసభ సమావేశంపై విచారణ జరిపించాలని సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం డీసీవో రజినికి సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్షిక సమావేశంలో సంఘంలో మూడవ వంతు సభ్యులు హాజరు కాకున్నప్పటికి సమావేశాన్ని నిర్వహించడం విచారకరమన్నారు. ఆడిట్ అయిన జమ, చెల్లింపు, వ్యాపార, ఆదాయ, వ్యయ ఆస్థి బాధ్యతల పట్టికలను అధికారులు పరిశీలించి పూర్తి స్థాయిలో విచారణ జరపాలన్నారు. సంఘంలో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. 2023-24 ఆడిట్ రిపోర్టుపై అభ్యంతరాలపై అనుమానాలను వ్యక్తపర్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి, మాజీ ఎంపీపీ విజేందర్, యాట శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిస్తాం

సంగెం, సెప్టెంబరు 21: స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను కొనసాగిస్తామని పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు కందకట్ల నరహరి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పద్మశాలి భవనంలో ఆయన వర్ధంతి సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్తామని చెప్పారు. 90 ఏళ్లలో సైతం జంతర్ మంతర్ వద్ద దీక్ష చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బిట్ల సత్యనారాయణ, ఇప్పకాయల రమేష్‌బాబు, విజయ్‌ప్రకాష్, మనోహర్, కందకట్ల సంపత్, బిట్ల శ్రీనివాస్, రామకృష్ణ, తిరుపతి, వేణుప్రసాద్, కటకం భిక్షపతి, కోడాటి సత్యం, నల్లరాజు, శివశంకర్, పులిపాటి మధుసూదన్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

రాయపర్తి, సెప్టెంబరు 21: మండలంలోని ఊకల్ శివారు బాలాజీ తండాలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తండ్రి బానోతు కేవుల నాయక్ శనివారం అనారోగ్యంతో మృతి చెందగా భౌతికకాయాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సందర్శించి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్‌ను, కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ పూస మధు, అశ్రఫ్‌పాషా, రంగయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాక్ పోలింగ్

దుగ్గొండి, సెప్టెంబరు 21: మండలంలోని గిర్నిబావిలోని న్యూవిజన్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఓటు వేసే విధానం, ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించారు. చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌గా పోరెడ్డి నర్సింహారెడ్డి, ఎలక్షన్ కమిషనర్‌గా ఎరుకల మహిపాల్‌రెడ్డి, పరిశీలకుడిగా మోతె రాజులు వ్యవహరించారు. వారు మాట్లాడుతూ మాక్ ఎలక్షన్‌లు నిర్వహించడంతో విద్యార్థులలో ఓటుపై అవగాహన కలుగుతుందన్నారు. హెడ్ బాయ్‌గా సుశాంత్, హెడ్ గర్ల్‌గా వర్షిణిలు గెలుపొందారు.

రోడ్లపై ధాన్యం పోస్తే చర్యలు

దుగ్గొండి, సెప్టెంబరు 21: రోడ్లపై ధాన్యం పోసినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఎస్సై మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం ఎండబోయడానికి రోడ్లపై పోయడం వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ప్రమాదాలు జరుగుతున్నాయని, రైతులు ధాన్యాన్ని రోడ్లపై పోయవద్దని సూచించారు.

బాలిరెడ్డికి జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు

గీసుగొండ, సెప్టెంబరు 21: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం మరియపురం మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డికి 2022-23 సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డును భారత గ్రామీణ అధ్యయన పరిశోధన అకాడమీ(అగ్రశ్రీ) వారు ప్రకటించారు. గ్రామపంచాయతీ అభివృద్ధిని వివిధ అంశాలుగా పరిగణించి ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా 6 జాతీయ స్థాయి అవార్డులను అగ్రశ్రీ అందచేస్తుంది. కాగా, సర్పంచ్ పనితీరు ఆధారంగా ఈ గ్రామ స్వరాజ్ కింద అల్లం బాలిరెడ్డికి జాతీయ స్థాయి ఉత్తమ అవార్డును ప్రకటించింది. త్వరలో తిరుపతిలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో బాలిరెడ్డికి అవార్డును ప్రదానం చేస్తామని అగ్రశ్రీ వ్యవస్థాపక సంచాలకులు డాక్టర్ సుందర్‌రాం తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ శాంతి దినోత్సవం

నర్సంపేట, సెప్టెంబరు 21: నర్సంపేట పట్టణంలోని అక్షర ద స్కూల్, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో శనివారం అంతర్జాతీయ శాంతి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రపంచ శాంతిని కోరుకుంటూ విద్యార్థులు తెల్లని దుస్తులు ధరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ అంతర్జాతీయంగా అహింస, ప్రపంచ దేశాల మధ్య శాంతి నెలకొల్పేందుకు ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తనవంతు కృషి చేస్తున్నదన్నారు. సెప్టెంబరు 21న సభ్య దేశాలకు శాంతి, కాల్పుల విరమణ గురించి ఐక్యరాజ్య సమితి అవగాహన కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో బిట్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ ఎ.వనజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల కమిటీ ఎన్నిక

ఖానాపురం, సెప్టెంబరు 21: పీఆర్టీయూ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలుత నిర్వహించిన మండల శాఖ సర్వసభ్య సమావేశానికి జిల్లా శాఖ అధ్యక్షుడు ఇందునూరి రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించడం, సీపీఎస్ స్థానంలో ఓపీఎస్‌ను వెంటనే ప్రవేశపెట్టాలని, 317 జీవో ప్రకారం నష్టపోయిన ఉపాధ్యాయులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ పెండెం భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా అలువాల భిక్షపతి, అసోసియేట్ అధ్యక్షుడిగా రమేష్, మహిళా ఉపాధ్యక్షురాలిగా భూక్య విజయలక్ష్మి, కార్యదర్శిగా రాజునాయక్, మహిళా కార్యదర్శిగా శామంతలను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా పూర్వ అధ్యక్షుడు శానా ఉమామహేశ్వరరావు, పత్రికా సంపాదకులు ఎన్వీ రాజు, సీనియర్ నాయకులు పరుపాటి సుధాకర్, నక్కిరెడ్డి మహేందర్, జేతురామ్‌నాయక్, హెచ్‌ఎంలు వెంకట్రాములు, ఆరిఫ్ హుస్సేన్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మకు సముచిత స్థానం

సంగెం, సెప్టెంబరు 21: వీరనారి చాకలి ఐలమ్మకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని మండల రజక సంఘం నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన వారు మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరంలోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడంతో తగిన ప్రాధాన్యత లభించిందని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం పోరాటం చేసిన ఐలమ్మ పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మునుకుంట్ల మోహన్, బొడ్డుపల్లి వెంకట్రాజం, పాణి, యువరాజ్, శ్రీనివాస్, శంకర్, ప్రభాకర్, బోగి రవి, శ్యామ్, దామోదర్, శ్రీనివాస్, రాములు, వైకుంఠం, శివ, సూరయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

సమీక్షలో కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 21: రైతులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్నే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సత్యశారద సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం 2లక్షల 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. 203 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, తేమ సాంద్రత కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో సన్నరకం ధాన్యం ఎక్కువగా సాగు చేశారని, ఈ సంవత్సరం వ్యవసాయ శాఖ అధికారులు ఆయా మండలాల వారీగా ధాన్యం పండించిన రైతుల వివరాల నివేదిక అందించాలన్నారు. ధాన్యం తూకం విషయంలో అవకతవకలు జరగకుండా చర్యలు చేపట్టాలని, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ సీల్స్ పరిశీలించాలని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసేందుకు సౌకర్యం కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సివిల్ సప్లై డీఎం సంధ్యారాణి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఉమారాణి, డీఎం సురేఖ, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీసీవో నీరజ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.8లక్షల చెక్కు అందజేత



కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

చెన్నారావుపేట, సెప్టెంబరు 21: మండలంలోని పదహార్‌చింతల్ తండాలో ఉన్మాది దాడిలో తల్లిదండ్రులను కోల్పోయిన బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన రూ.8లక్షల చెక్కును నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్మాది దాడిలో తల్లిదండ్రులను కోల్పోయిన బానోతు దీపిక, మదన్‌లకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. భవిష్యత్తులో వారి ఉన్నత చదువుతో పాటు అన్ని విధాలా తనవంతు సహాయ సహకారాలను అందజేస్తానన్నారు. కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బోంపెల్లి దేవేందర్‌రావు, ఏసీపీ కిరణ్‌కుమార్, తహసీల్దార్ ఫణికుమార్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి మంద యాకయ్య, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్, మాజీ ఎంపీటీసీ రమాబాయి, భూక్య మోహన్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల ధరల పట్టిక అందుబాటులో ఉంచాలి

జిల్లా వ్యవసాయాధికారి అనురాధ



మహ్మదాపురంలోని పీఏసీఎస్ ఎరువుల గోదాంను తనిఖీ చేస్తున్న డీఏవో అనురాధ

దుగ్గొండి, సెప్టెంబరు 21: ఎరువుల స్టాక్ వివరాలు, ఎమ్మార్పీ ధరల పట్టికను రైతులకు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి అనురాధ అన్నారు. మండలంలోని మహ్మదాపురం, తిమ్మంపేట గ్రామాలను శనివారం సందర్శించారు. మహ్మదాపురం పీఏసీఎస్ ఎరువుల గోదాము, రిజిస్టర్లను తనిఖీ చేశారు. తిమ్మంపేటలో సాగు చేసిన మిర్చి పంటలను పరిశీలించారు. ఎరువులకు సంబంధించిన రికార్డులు, స్టాక్ వివరాలు ఉండాలన్నారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని సీఈవోను కోరారు. మిరప పంట నాటే ముందు దుక్కిలో ఎకరానికి 8కిలోల చొప్పున ట్రైకోడర్మను వేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో మాధవి, ఏఈవోలు హన్మంతు, రాజేష్, రైతులు రవికుమార్, కొంరెల్లి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం శిబిరం

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 21: నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో శనివారం సదరం శిబిరం నిర్వహించారు. శిబిరంలో 48 మంది దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు చేశారు. అర్హులైన దివ్యాంగులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు డీఆర్‌డీఏ పెన్షన్ విభాగం అధికారులు తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు విరీన్, నర్సింహారెడ్డి, వేణు, సురేందర్, వాసవి, డాక్టర్ నర్సింహస్వామి, డీఆర్‌డీఏ సదరం విభాగం అధికారులు శైలజ, కిరణ్ పాల్గొన్నారు.

ఆకేరు వాగు పరిరక్షణకు ఎమ్మెల్యే కృషి

- మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 21: వర్ధన్నపేటలోని ఆకేరు వాగు పరిరక్షణకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కృషి చేస్తున్నారని మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి అన్నారు. శనివారం మండలంలోని ఇల్లంద గ్రామ శివారులో ఆకేరు వాగు చెక్‌డ్యాం ఎడమ వైపున తెగిపోయిన చోట తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగులోని నీరు వృథాగా వెళ్లి పోవడంతో భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటి పోతాయనే ఆలోచనతో ఎమ్మెల్యే పనులు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇన్ని రోజుల పాటు నీటి ప్రవాహం కారణంగా పనులు చేయలేకపోయామని గుర్తు చేశారు. వాగుపై చెక్‌డ్యాం శాశ్వత మరమ్మతు పనుల కోసం రూ.30లక్షల నిధులు మంజూరయ్యాయని, పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంచాల రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు మైస సురేష్, నాయకులు గుజ్జ వీరరాఘవరావు, పులి శ్రీనివాస్, వెంకట్, అన్వర్, షబ్బీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఎస్ఈ

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 21: విద్యుత్ అధికారులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వరంగల్ జిల్లా ఎస్‌ఈ మధుసూదన్‌రావు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని వర్ధన్నపేట సబ్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ సిబ్బంది విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో లోపాలు, లూస్ లైన్స్ గుర్తించి వెంటనే సరిచేయాలన్నారు. పీక్‌లోడ్ అవర్స్‌లో టాంగ్ టెస్టర్ రీడింగ్స్ తీసి ఓవర్ లోడ్ ట్రాన్స్‌ఫార్మర్స్, లోవోల్టేజీ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. రైతులు తప్పనిసరిగా తమ వ్యవసాయ మోటార్ల దగ్గర కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పేదలు రూ.938 చెల్లించి విద్యుత్ మీటర్ కనెక్షన్ తీసుకొని గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్స్ ఉచిత పథకాన్ని పొందాలని సూచించారు. సమావేశంలో డీఈ భిక్షపతి, ఏడీఈ కన్న రాజు, ఏఈ, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న నలుగురిపై కేసు

30 లీటర్ల గుడుంబా, రెండు బైక్‌లు స్వాధీనం

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 21: గుడుంబాను అక్రమంగా రవాణా చేస్తున్న నలుగురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నరేష్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నర్సంపేట-మహబూబాబాద్ రోడ్‌లో శనివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా రెండు వాహనాలపై వెళ్తున్న ఖానాపురం మండలం నాజీతండా, బోటిమీదితండాకు చెందిన కుంసోతు హతియ, మాలోతు నీలమ్మ, భూక్య శంకర్, వీరస్వామిలను తనిఖీ చేయగా 30 లీటర్ల గుడుంబా లభించిందన్నారు. దీంతో నలుగురిపై కేసు నమోదు చేసి రెండు ద్విచక్ర వాహనాలు, గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలో ఎస్సై శార్వాణి, సిబ్బంది స్వర్ణలత, శివరాజు, నాగరాజు, దిలీప్, రంజిత్, ఫైమద్ పాల్గొన్నారు.

15 లీటర్ల గుడుంబా పట్టివేత

సంగెం, సెప్టెంబరు 21: మండలంలోని గిరిజన తండాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. శనివారం నల్లబెల్లి గ్రామ శివారు తోట్లతండాలోని పొత్తుల బావి వద్ద గుడుంబా తయారు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. 15 లీటర్ల గుడుంబా టిన్నులో రవాణాకు సిద్ధంగా ఉండటంతో స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

గంజాయి పట్టివేత

గీసుగొండ, సెప్టెంబరు 21: గంజాయిని తరలిస్తుండగా ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ బాబులాల్ తెలిపారు. ఎస్ఐ జానీపాషా శనివారం ధర్మారం వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి తెల్ల కవర్ పట్టుకొని అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించగా కవర్‌లో 250 గ్రాముల గంజాయి లభ్యం కావడంతో అదుపులోకి తీసుకున్నారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తి మండిబజార్‌కు చెందిన మహ్మద్ ఉబేద్‌గా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి

పర్వతగిరి, సెప్టెంబరు 21: విద్యార్థులు ఒత్తిడిని జయించాలని సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ సత్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన మోటివేషనల్ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఒత్తిడిని జయిస్తూ క్రమశిక్షణతో చదువుతూ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం ఏకాగ్రతతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీశైలం, హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు జయరాజ్, బుగ్గ కల్పన, కరీం, మధు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 21: పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు మైస సురేష్, నాయకులు రవీందర్‌రెడ్డి, సుదాకర్, సమ్మయ్య, రాజు, ఏకాంతం, కీమా తదితరులు పాల్గొన్నారు.